క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో నేడు స్పాట్ కౌన్సెలింగ్

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని గిరిజన బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్టు ఖమ్మం ఆర్‌సీఓ నాగార్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు(బాలురు) బీఏ, బీకామ్, బీజడ్సీ, ఎంబీజడ్సీ, ఎంపీసీఎస్ గ్రూప్‌లలో ప్రవేశాలకు నేడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫైనల్ స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఆధార్‌కార్డు రెండు జతల జిరాక్స్ పత్రాలతో ఎనిమిది పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా కళాశాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆందోళనకు సిద్ధం..

అశ్వాపురం: భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు నివాసం ఉండే గౌతమీనగర్ కాలనీలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, వారి కుటుంబ సభ్యులు నేడు గౌతమీనగర్ కాలనీ గేట్ ఎదుట ధర్నాకు సిద్ధమవుతున్నారు. దశాబ్దకాలంగా విధులు నిర్వహిస్తున్న 40 మంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని కొత్త నిబంధనల పేరుతో ఇటీవల అర్ధాంతరంగా తొలగించారు. ఉపాధి లేక నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు సిబ్బందికి జూన్ నెలలో పని చేసిన వేతనం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఏరియర్స్, బోనస్ చెల్లించలేదు. సెక్యూరిటీ గార్డులకు సంబంధించి ఖాళీ బ్యాంక్ ఓచర్స్‌పై సంతకాలు పెట్టించుకోవడంతో ఏరియర్స్, బోనస్ డబ్బులు స్వాహా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమకు న్యాయం చేయాలని సిబ్బంది కోరుతున్నాయి.

ఆధార్ సంస్థ ఔదార్యం

కరకగూడెం: ఏజెన్సీలో ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆధార్ సంస్థ శనివారం శ్రమదానం చేసింది. సంస్థ సభ్యులు కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామమైన అంగారుగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఆవరణాల చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసి కట్టెలతో కంచెను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేష్, సభ్యులు, గ్రామ పెద్దలు మడకం నందయ్య, కలం భీమయ్య, రాము, గ్రామస్తులు, పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన జుంజూరు గణపతికి ఉమ్మడి ఖమ్మం–వరంగల్–నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ద్వారా మంజూరు అయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాసరావు, పాయం నరసింహారావు, గద్దల భాను ప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పత్రం రెండేళ్ల కాలపరిమితికే ఇవ్వాలి

మణుగూరురూరల్: సింగరేణిలో ఎన్నికైన కార్మిక సంఘాల గుర్తింపు పత్రాన్ని రెండేళ్ల కాలపరిమితికి మాత్రమే ఇవ్వాలని, ఈ నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పీవీకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘ ఎన్నికలు జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా.. నేటి వరకు గుర్తింపు సంఘాల కాలపరిమితి పత్రం ఇవ్వలేదన్నారు. దీనికి సింగరేణి యాజమాన్యమే బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో లక్ష్మారావు, వై.రామ్మూర్తి, నందం ఈశ్వరరావు, విల్సన్ రాజు, లక్ష్మణరావు, బిక్షపతి, బొల్లం రాజు, ప్రభాకర్‌రావు, బుచ్చిరెడ్డి, సుమన్, శ్రీకాంత్, కిరణ్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధం'

మణుగూరుటౌన్: కేపీయూజీ అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తున్న 82 మంది జనరల్ మజ్దూర్లకు ఉపరితల గనులపై పదోన్నతులు కల్పిస్తూ శనివారం యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేయగా.. అందులో గెలిచిన కార్మిక సంఘాలు, నాయకులు చెప్పిన చోట నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇచ్చారని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి ఆదివారం ఆరోపించారు. సీఎండీ బలరాం ఆగస్టు 16న మణుగూరు ఏరియాలో పర్యటన చేసిన సమయంలో అధికారులకు ఇచ్చిన ఆదేశాలను కొంతమంది ఏరియా అధికారులు గెలిచిన కార్మిక సంఘాల అండదండలతో బుట్టదాఖలు చేయడం సరికాదన్నారు.

కొలువుదీరిన గణనాథులు


దమ్మపేట: వినాయకుడికి పూజ చేస్తున్న దృశ్యం

వినాయక చతుర్థిని పురస్కరించుకుని శనివారం గణనాథులు కొలువుదీరారు. విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునే వినాయకుడి విగ్రహాలను మండపాల్లో వాడవాడలా నెలకొల్పారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉండ్రాళ్లతో ప్రత్యేక పూజలు చేసి గణేషుని పాటలతో యువత హోరెత్తించారు. భక్తులు తమ శక్తి కొలది పూజించుకుని విఘ్నాల నుంచి కాపాడాలని వేడుకున్నారు. కమిటీవారు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కొన్నిచోట్ల అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ములకలపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో గణపతికి పూజ చేస్తున్న అర్చకుడు


మణుగూరుటౌన్: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


భద్రాచలంటౌన్: గణనాథున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు


భద్రాచలంటౌన్: వినాయకుడికి పూజలు చేస్తున్న పీవో రాహుల్ దంపతులు


భద్రాచలంటౌన్: పూజలు నిర్వహిస్తున్న ఏఎస్పీ అంకిత్ కుమార్


అశ్వారావుపేటరూరల్: భక్తులకు అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు


చర్ల: గణేష్‌నగర్‌లో గణేషుడిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న సీఐ రాజువర్మ


అశ్వాపురం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ..


కరకగూడెంలో కొలువుదీరిన గణనాథుడి వద్ద భక్తులు


దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో ప్రతిష్ఠించిన వినాయకుడి దగ్గర యువత కోలాహలం


చంద్రుగొండ: పూజలు చేస్తున్న భక్తులు

డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

మణుగూరురూరల్: గంజాయి నిర్మూలనలో సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మేడ ప్రసాద్ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆదివారం పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలైన శివలింగాపురం, సురక్షాబస్టాండ్‌లలో డాగ్ స్క్వాడ్ నిశిత పరిశీలనలు చేసింది. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ.. గంజాయి బారిన పడి అనేకమంది తమ బంగారు భవిష్యత్తును చిద్రం చేసుకుంటున్నారన్నారు. గంజాయిని రవాణా చేసినా, విక్రయాలకు పాల్పడిన చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు'

ములకలపల్లి: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం పడకేసిందని, విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. గౌరి నాగేశ్వరరావు అధ్యక్షతన ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండలకమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మూరుమూల గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలని, రోగులకు అన్నిరకాల రక్త పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, మాలోతు రావూజా, గొగ్గెల ఆదినారాయణ, గోపగాని లక్ష్మీనర్సు, కుంజా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ఆర్‌కు గురుబ్రహ్మ అవార్డు

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి నాగేశ్వరరావు(బీఎన్ఆర్)కు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గురుబ్రహ్మ అవార్డును అందజేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో విశేష సేవలను అందించిన ఉపాధ్యాయులకు ఈ అవార్డులను అందించారు. భద్రాద్రి జిల్లా నుంచి బీఎన్ఆర్‌కు ఈ పురస్కారం దక్కింది. గురుబ్రహ్మ అవార్డును అందుకున్న బీఎన్ఆర్‌ను జిల్లాలోని పలు విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

నిమజ్జన ఘాట్ పరిశీలన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి నదిలో గణపతి నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసే ఘాట్‌ను భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి నది తీరంలో గణేష్ నిమజ్జనాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనాలకు వెళ్లే రూటు, నిమజ్జన ప్రదేశం తదితర ఏర్పాట్లు కోసం పరిశీలించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం గోదావరి నదిలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వస్తుంటారని, దీనిలో భాగంగా పట్టణంలో ట్రాఫిక్ నిలిచిపోకుండా, స్థానిక ప్రజలకు, భక్తులకు ఇబ్బంది కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు, పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్ ఉన్నారు.


కరకట్ట వద్ద నిమజ్జన ఘాట్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత్ కుమార్

రుణమాఫీ వర్తింపజేయాలి

కరకగూడెం: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భట్టుపల్లి గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు ఊకే నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ విధానాలనే అనుసరిస్తుందని విమర్శించారు. రుణమాఫీ కానీ రైతులకు సంబంధించి లోన్‌రెన్యూవల్, ఆధార్‌నంబర్ల తప్పులను సరి చేసి రుణమాఫీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు మండల కమిటీ సభ్యుడు చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని దిబ్బగూడెం గ్రామంలో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, సాగులో ఉన్న పోడు భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని, పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సోడెం ప్రభాకర్, కుంజా అర్జున్, పూనెం దుర్గమ్మ, కాకా బాబు, జెడ్డి నారాయణ, కురం రాజులు, పాయం జనార్దన్, మడకం సత్తిబాబు, చీమల ముత్యాలు, పూకే రమేష్, పాయం సీతారాములు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించొద్దు

పినపాక: ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పినపాక మండల ఎంపీఓ వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ఇటీవల జానంపేట గ్రామ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ పనులు నిర్వహిస్తుండగా కొంతమంది బడా వ్యాపారులు అడ్డుకుని తనను, పంచాయతీ అధికారులను దూషించి బెదిరించారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఈ–బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నేడు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


బూర్గంపాడు: సాయి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: కిన్నెరసాని వరదలో గల్లంతైన ఉప్పుసాక గ్రామానికి చెందిన జారె సాయి కుటుంబానికి ప్రభుత్వపరంగా అన్నివిధాల అండగా ఉంటామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్ మాట్లాడి పరిహారాన్ని వెంటనే అందించాలని కోరారు. అనంతరం ఉప్పుసాక గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేటీపీఎస్ నుంచి వస్తున్న బూడిద వలన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామంలో పిల్లలు ఆడుకునేందుకు క్రీడామైదానం లేదని స్థానిక యువకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సారపాకలో జరిగిన కార్యక్రమంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. గణపతి మండపాలలో పూజలు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు బట్టా విజయ్‌గాంధీ, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, బెల్లంకొండ రామారావు, భజన సతీష్, భజన ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.5.15లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం సాయంత్రం అందజేశారు. దీంతోపాటు ఏడీఎంఎస్ ఎలక్ట్రిక్ ఈ బైక్ షోరూంను గుట్టమల్లారంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బైక్‌లు బుక్ చేసుకున్న యజమానులను కొత్త బైక్‌లను అందించారు. మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడిబాబు, పాతూరి వెంకన్న, వీరంకి వెంకట్రావ్, పెనుగొండ సాంబశివరావు ఉన్నారు.

వరద బాధితులకు వితరణ

మణుగూరుటౌన్: వాగుఒడ్డు ఎస్టీ హాస్టల్ వద్ద వరదలతో నిరాశ్రయులైన 40 కుటుంబాలకు శనివారం శ్రీసాయి లక్ష్మి శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ చేశారు. దేవత శ్రీనివాసరావు, శొంఠినేని శశాంక్‌లు ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. అంతకుముందు ఆ గ్రామస్తులకు సూపర్‌మార్కెట్ వ్యాపారి దోసపాటి ధర్మారావు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు దాతలను సన్మానించారు. గ్రామస్తులు సాయిభరత్, శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు పూడికతీత పనులు

కరకగూడెం: నేడు మండల కేంద్రంలోని డ్రెయినేజీలో పూడికతీత పనులు ప్రారంభిస్తున్నట్లు కరకగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రెయినేజీలపై ఆక్రమిత నిర్మాణాలను తొలగించడంతోపాటు, సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా డ్రెయినేజీలను శుభ్రం చేసి వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

యువకుల శ్రమదానం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ముస్లిం బజారులో నివాసముంటున్న బద్రున్నీసా బేగం ఇంటిచుట్టూ వర్షపు నీరు చేరడంతో స్థానిక యువకులు శ్రమదానంతో ఆదివారం కాలువలు ఏర్పాటు చేశారు. ఇంట్లో చేరిన నీటిని బయటకు వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో యువకులు ఎండీ.ఆబీద్, అష్రఫ్, ఆసిఫ్, రబ్బాని, షారుక్ పాల్గొన్నారు. వృద్ధురాలికి ప్రభుత్వం సాయం అందించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

సంతలో అన్నదానం

చర్ల: మీకోసం మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చర్లలో అన్నదానం నిర్వహించారు. చర్లకు చెందిన ఇర్సా సమ్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన సుమారు 200 మంది ఈ అన్నదానాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు, కీర్తిశేషులు ఇర్సా సమ్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలోని దంతెనం గ్రామానికి చెందిన బొమ్మెడి సత్తిబాబు అనే మత్స్యకారుడికి చెందిన చేపల వేట చేసే మర ఇంజన్ పడవ వలలు కొట్టుకుపోయాయని, రూ.2లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. గోదావరిలో చేపల వేటే జీవనాధారంగా జీవిస్తున్న సత్తిబాబు ప్రతిరోజు లాగానే శనివారం రాత్రి కూడా పడవను గోదావరి ఒడ్డున నిలిపి ఇంటికి వచ్చాడు. తెల్లవారి వెళ్లి చూడగా పడవ, పడవలోని వలలు కనిపించలేదు. తురుబాక వరకు మరో పడవలో గోదావరిలో వెళ్లి చూసినా జాడ దొరకలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఫొటోగ్రాఫర్లకు ఆర్థిక సాయం


నగదు, బియ్యం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మణుగూరుటౌన్: వరదల కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఫొటోగ్రాఫర్లకు జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఆయా కుటుంబాలకు ఆదివారం రూ.1.10 లక్షలను జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ, జిల్లా కన్వీనర్ పంపన రమేశ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అసోసియేషన్ రూ.40వేలు, నల్లగొండ జిల్లా అసోసియేషన్ 20వేలు, కరీంనగర్ జిల్లా నుంచి 10వేలు, సూర్యాపేట నుంచి 6,300, భద్రాద్రి జిల్లా ఫొటోగ్రాఫర్లు 34వేలు అందించారన్నారు. ఆ నగదును బాధిత కుటుంబాల నివాసాలకు వెళ్లి ఒక్కొక్కరికి రూ.26వేల నగదు, 25 కేజీల బియ్యం అందజేసినట్లు తెలిపారు. మణుగూరు మండల అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్, గౌరవ అధ్యక్షుడు గాజుల పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పుసులూరి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, రామదాస్, శ్రీహరి, జేమ్స్, ఆనంద్, ఈరెల్లి సురేశ్, ముకుంద రావు, స్థానిక ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఏకధాటిగా కుండపోత వాన

అశ్వారావుపేట నియోజకవర్గంలో ఏకధాటిగా జోరువాన కురిసింది. శనివారం మొదలుకొని ఆదివారం వరకు చినుకుపడుతూనే ఉంది. ఆయా ప్రాంతాల్లోని వాగులు వంకలు పొర్లాయి. చప్టాలు, లోతట్టు ప్రాంతాల మీదుగా వరద పారడంతో కాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ క్షేత్రాల్లో ఇసుక మేటలు వేశాయి. ములకలపల్లి మండలం చాపరాలపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాడు శివారులో పాములేరు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: పాపిడిగూడెంలో వేరుశనగ చేనులో వేసిన ఇసుక మేటలు


ములకలపల్లి: అలుగు పోస్తున్న మూకమామిడి ప్రాజెక్ట్


అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెం-గుర్రాల చెరువు మార్గంలో పడిన భారీ గండి


అశ్వారావుపేటరూరల్: పాపిడిగూడెం వద్ద రోడ్డుపై పారుతున్న వరదనీరు


చంద్రుగొండ: మద్దుకూరు వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


చంద్రుగొండ: సీతాయిగూడెం సమీపంలోని చప్టాపై ప్రవాహం


అశ్వారావుపేటరూరల్: లోతట్టు ప్రాంతంలోని ఇంట్లోకి పారుతున్న వరదనీరు